క్లుప్తంగా

సర్వే పునః ప్రారంభం



కన్నాపురం మెయిన్ రోడ్డును సర్వే చేసి మార్కింగ్ చేస్తున్న అధికారులు

సాక్షి స్పందన

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం–కన్నాపురం మెయిన్ రోడ్డు సర్వేను పలు శాఖల ప్రభుత్వ అధికారులు సోమవారం పునః ప్రారంభించారు. సాక్షి పత్రికలో గత నెల 28వ తేదీ ప్రచురితమైన పీజీఆర్ఎస్ తీరు అపహాస్యం అనే శీర్షికపై స్పందించిన కలెక్టర్ వెట్రిసెల్వి పరిష్కార చర్యల నేపథ్యంలో 31వ తేదీ సర్వేకు ఉపక్రమించారు. రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సర్వే చేపట్టగా సర్పంచ్ ముప్పిడి విజయకుమారి అభ్యంతరంతో సర్వే ప్రక్రియ అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ఎఫ్ఎంబీ ఉన్న ప్రకారం సర్వే కొలతలు అధికారులు పునః ప్రారంభించారు. సర్వే ప్రక్రియ పూర్తయిందని రోడ్డు విస్తరణ అంశం కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు ఉంటుందని ఆయా శాఖల అధికారులు పేర్కొన్నారు. కొవ్వూరు, జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం జాతీయ రహదారులను, డ్రెయినేజీతో సహా దుకాణదారులు ఆక్రమించారనీ వాటిపై కూడా ఆర్అండ్‌బీ శాఖ అధికారులకు దృష్టి పెట్టాని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే అనేక పర్యాయాలు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఏర్పడుతున్నాయని పేర్కొంటున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

జంగారెడ్డిగూడెం: స్థానిక హైస్కూల్ వద్ద ఉన్న కనకదుర్గమ్మ ఆలయ 31వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి నిత్య కైంకర్యాలతో పాటు విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో చండీహోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు తాళ్ల రామారావు, సత్యవతి దంపతులు, తమ్మన వెంకటేశ్వరావు, కంచెర్ల రవికుమార్, బాలకృష్ణ, తాళ్ల శ్రీనివాస్, ముచ్చిన పల్లి, రవి కుమార్, కె.నాగేంద్ర, ద్వారంపూడి వీరారాఘవ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు

ద్వారకాతిరుమల: క్షేత్ర దేవత శ్రీకుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలను ఈ నెల 3 నుంచి 5 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ ఎన్వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచన, ఋత్విగ్వరణ, పంచగవ్యప్రాసన, దీక్షాధారణ, అంకురార్పణలు నిర్వహించనున్నారు. అలాగే 4న ఉదయం సర్వతోభద్ర మండలి ఆరాధన, మూలమంత్ర అనుష్టానం, హోమాలు నిర్వహిస్తారు. ఉత్సవాల ఆఖరి రోజైన 5న ఉదయం మూల విరాట్‌లకు నవకలశ స్నపన, శ్రీచక్రార్చన, సప్తశతి పారాయణ, హోమాలు, మహా పూర్ణాహుతి, ఆశీర్వచనం, పండిత సత్కారం కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈఓ తెలిపారు.

మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలి

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరంలో నిబంధనలకు విరుద్ధంగా మట్టి అక్రమ తవ్వకాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు పి.మంగరాజు అన్నారు. సోమవారంఆయన స్థానిక విలేరలతో మాట్లాడారు. కార్యక్రమంలో గిరిజన యువత జి.పవన్‌కుమార్, కె.రవి, కె.రామచంద్రం, డి.రాజ్‌కుమార్, కె. జలపాలు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

టి.నరసాపురం: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బొర్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిలంచారు. బొర్రంపాలెం ఉన్నత పాఠశాలలో 2001లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సోమవారం ఆత్మీయంగా కలుసుకున్నారు. పలు వృత్తుల్లో స్థిరపడిన సుమారు 100 మంది విద్యార్థులు ఒకరినొకరు కలుసుకొని, ఆప్యాయంగా పలుకరించుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు.

1000 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

కుక్కునూరు: నాటుసారా తయరీ కేంద్రాలపై సోమవారం కుక్కునూరు పోలీసులు దాడి చేసి 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. కుక్కునూరు సీఐ ఎం.రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం, శ్రీధర వేలేరు పంచాయతీ పరిధిలోని వేలేరు గ్రామ శివారులో నాటుసారా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ దాడుల్లో సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. నాటుసారా తయారు చేసేవారిపై చట్టపరంగా చర్యలు చేపడతామని సీఐ హెచ్చరించారు.

సూపర్ సిక్స్ హామీల అమలు ఎప్పుడో?

- అడ్డగోలు హామీలతో గద్దెనెక్కిన 'కూటమి'
- మరోసారి చంద్రబాబు మార్కు మోసం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన సచివాలయం(ఫైల్)

చింతలపూడి: ఎన్నికలకు ముందు కూటమి నాయకులు యువతకు అడ్డగోలుగా హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగం, లేదా నెలకు రూ.3000 నిరుద్యోగ భృతి ఇస్తామంటూ చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిగా కావస్తుంది. ఇంత వరకు ఉద్యోగాల ఊసే లేదు. నిరుద్యోగ భృతి కూడా అమలు చేయడం లేదు. తాము వస్తే జాబ్ క్యాలెండర్ ఇస్తామమని చెప్పి ఇప్పుడు జాబ్ క్యాలెండర్ ఊసే ఎత్తడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చింది ఇంకా తమకు ఉద్యోగాలు వస్తాయన్న ధీమాతో చాలా మంది యువత ఏడాది నుంచి కోచింగ్ సెంటర్లకు వెళుతున్నారు. కొంతమంది అయితే విజయవాడ, గుంటూరు, హైదరాబాద్, విశాఖపట్నానికి వెళ్లి పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు. అయితే చేస్తున్న పనులు మానుకొని ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి కోచింగ్ సెంటర్‌కు వెళుతున్న యువత ఖర్చులకు తల్లిదండ్రులను డబ్బులు అడగాలంటే ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తుంది. నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్న యువత సుమారు నియోజకవర్గంలో 75 వేల నుంచి లక్ష వరకు ఉంటారని అంచనా.

వైఎస్ జగన్ హయాంలో..

2019లో అధికారం చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ ఉద్యోగాల నియామకం మీద ప్రత్యేక దృష్టి పెట్టారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టి వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారు. నియోజకవర్గంలో సుమారు 709 మందికి సచివాలయాల్లో శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి వారికి బంగారు భవిష్యత్తు అందించారు. అదే విధంగా 1,330 మంది గ్రామ, వార్డు వాలంటీర్లను నియమించి నెలకు రూ.5,000 గౌరవ వేతనం ఇచ్చి వారిని ఆదుకున్నారు. నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు పొందేందుకు ప్రతి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ సంస్థ ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త ఉద్యోగాల సంగతి దేవుడెరుగు ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారని యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగాలు ఎప్పుడు కల్పిస్తారు?



ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు ప్రభుత్వ ఉద్యోగాలు ఎప్పుడు కల్పిస్తారో చెప్పాలి. కూటమి ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తారని నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. కనీసం ఉద్యోగ అవకాశాలు కల్పించే వరకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3,000 అందించాలి.

–ఎస్.భరత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం కార్యదర్శి

వెన్నుపోటు దినం విజయవంతం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

టి.నరసాపురం: జూన్ 4వ తేదీన కొయ్యలగూడెంలో నిర్వహించే నియోజకవర్గ స్థాయి వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనురాజు పిలుపునిచ్చారు. టి.నరసాపురంలో సహకార సంఘం మాజీ చైర్మన్ దేవరపల్లి ముత్తయ్య నివాస గృహం వద్ద సోమవారం వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు శ్రీను రాజు, వాసిరెడ్డి మధు, దేవరపల్లి ముత్తయ్య, కాల్నీడి సుబ్బారావు, కటకం మల్లికార్జునరావు, మాదంశెట్టి మల్లయ్య, కాల్నీడి జగన్, ఏపుగుంట పెద్దబాబు, ఆచంట కుటుంబరావు, ఓబిలనేని నాగేశ్వరరావు, సాయల సత్యనారాయణ, నార్లపాటి వెంకట్రావు, అర్జ బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని నిలదీసేందుకే 'వెన్నుపోటు దినం'

పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ హోంమంత్రి వనిత



వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ హోంమంత్రి వనిత, తదితరులు

ద్వారకాతిరుమల: ఎన్నికలకు ముందు అధికార దాహంతో హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వం ఆ హామీలను తుంగలోకి తొక్కి ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని మాజీ హోం మంత్రి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత ధ్వజమెత్తారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో ఆమె పార్టీ నేతలతో కలిసి సోమవారం వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మోసపూరిత పాలనను ఎండగట్టేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 4న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చినట్టు తెలిపారు. అందులో భాగంగా ఆరోజు నల్లజర్లలో నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో నాలుగు మండలాలకు చెందిన పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతాపనేని వాసు, పోల్కంపల్లి అనీల్, పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, బొండాడ వెంకన్నబాబు, మల్లెపూడి నాగమణి, చిలుకూరి చంద్రం, ఉక్కుర్తి వెంకట్రావు, షేక్ భాషా, బిరుదుగడ్డ బజారియ్యా, పానమాల ఉమామహేశ్వరరావు, రుద్ర శివాజీ, కృష్ణారెడ్డి, దొప్పసాని రాధాకృష్ణ, దాసరి రాంబాబు, చెలికాని ప్రవీణ్, చెలికాని బుల్లియ్యా, దూలపల్లి ప్రసాద్, అచ్యుత ఏసుబాబు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, గోపా నాగేశ్వరరావు, మానుకొండ కన్నయ్య, రుద్ర శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జంగారెడ్డిగూడెం: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు అన్నారు. జూన్ 4న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడికి వెన్నుపోటు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. సంవత్సర కాలంగా ఇచ్చిన హామీలు ఏమీ అమలు చేయలేదన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ఎండీయూ వాహనాల ద్వారా ఇచ్చే రేషన్ తీసేసి, మళ్లీ జనాలను రేషన్ షాపుల ముందు క్యూ కట్టించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిటికెల అచ్చిరాజు, వామిశెట్టి హరిబాబు, ముప్పిడి అంజి, ముప్పిడి శ్రీనివాసరావు, వందనపు వెంకటేశ్వరరావు, జెట్టి ఆదిత్య, బత్తిన చిన్న ఏవీ రమణమూర్తి, చిప్పాడ వెంకన్న, వీరవల్లి సోమేశ్వరరావు, నరెడ్ల బుజ్జిబాబు, బాబి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కామవరపుకోట: స్థానిక రహదారి బంగ్లాలో సోమవారం వెన్నుపోటు దినం పోస్టర్‌ను వైఎస్సార్‌సీపీ చింతలపూడి కన్వీనర్ కంభం విజయరాజు ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు నానాది సాగర్, డాక్టర్ రామకృష్ణ, దేవరపల్లి రామమోహనరావు, రాయంకుల సత్యనారాయణ, షేక్ మేరా సాహెబ్, సాయిల స్వాతి పాల్గొన్నారు.

వెన్నుపోటు చంద్రబాబు నైజం

మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పిలుపు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, తదితరులు

బుట్టాయగూడెం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో సూపర్‌సిక్స్ పథకాల పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలు హామీలుగానే మిగిలిపోయాయని ఇంతకంటే ప్రజలకు వెన్నుపోటు మరొకటి ఉండదని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. జీలుగుమిల్లి మండలం పి.అంకంపాలెంలో ముఖ్య నాయకులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశాల మేరకు ఈ నెల 4వ తేదీన కొయ్యలగూడెంలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బోదా శ్రీనివాసరెడ్డి, ఘంటసాల గాంధీ, ఉప్పల రాంపండు, ఎ.రవి, ఎస్.బాషా, వినయ్, జగదీష్, బి.వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరించిన నాయకులు

ఈ నెల 4వ తేదీన జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరేటి సత్యనారాయణ ఇంటి వద్ద ఆవిష్కరించారు. తెల్లం రమణ, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు తాళ్లూరి ప్రసాద్ పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

చింతలపూడి: జిల్లాను మలేరియా రహితంగా మార్చాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో మలేరియా మాసోత్సవాల సందర్భంగా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందకుండా లార్వీసైడ్ మందులు స్ప్రే చేయాలన్నారు. డ్రై డేలను పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్.మాలిని, చింతలపూడి సబ్ యూనిట్ మలేరియా అధికారి ఎన్ఏ ప్రసాద్, రాఘవాపురం, ఎర్రగుంటపల్లి వైద్యధికారులు కె.నరేష్, చైతన్య, ఎంపీహెచ్ఈవో శ్రీనివారరావు, సూపర్‌వైజర్లు రవి, ప్రమీల కుమారి, మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి



హెచ్ఎం గంగరాజును సత్కరిస్తున్న సంఘ సభ్యులు

జంగారెడ్డిగూడెం: స్థానిక బాలాజీ నగర్ ఎంపీపీ పాఠశాల అభివృద్ధికి అందరూ కృషి చేయాలని నూతన ప్రధానోపాధ్యాయులు కళ్లెం గంగరాజు తెలిపారు. సోమవారం బాలాజీ నగర్ ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా గంగరాజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాంగే నగర్ అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు గంగరాజును పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు. అలాగే శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డాంగే నగర్ అంబేడ్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు అమృతల రంగా, అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణరావు, పఠాన్ బాజీ, ఉపాధ్యక్షుడు ఎల్.శ్రీనివాస్, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ మంగయ్య, మద్దిపాటి నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో నూరు శాతం అడ్మిషన్లకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎం ముక్కంటి

చింతలపూడి: 2025–26 విద్యా సంవత్సరంలో నాలుగు మండలాల పరిధిలో గల హాస్టల్స్‌లో నూరు శాతం విద్యార్థినీ, విద్యార్థులు అడ్మిషన్లు తీసుకునే విధంగా కృషి చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ ఎం ముక్కంటి ఆదేశించారు. సోమవారం సహాయ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చింతలపూడి పరిధిలోని చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట, టి.నర్సాపురం వెల్ఫేర్ అసిస్టెంట్లు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం హాస్టళ్లలో నిర్వహిస్తున్న మరమ్మతు పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సహాయ సాంఘిక సంక్షేమాధికారి ఎ.మంగారత్నం, నాలుగు మండలాల వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత కుటుంబానికి పరామర్శ



కుటుంబరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ద్వారకాతిరుమల: మండలంలోని సత్తెన్నగూడెంలో వైఎస్సార్‌సీపీ నేత కుటుంబాన్ని మాజీ హోం మంత్రి, వైఎస్సార్‌సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత, కొవ్వూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు సోమవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన పార్టీ నేత మానుకొండ సుబ్బారావు సోదరుడు కుటుంబరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన సంతాప సభలో వారు పాల్గొని, మృతుడి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతాపనేని వాసు, పోలకంపల్లి అనీల్‌కుమార్, పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్, బొండాడ వెంకన్నబాబు, బిరుదుగడ్డ చల్లారావు, మానుకొండ కన్నయ్య, దాసరి రాంబాబు, చెలికాని బుల్లియ్య, చెలికాని ప్రవీణ్, బిరుదుగడ్డ బజారియ్య, మానుకొండ భీమయ్య, చిలకా సతీష్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



జంగారెడ్డిగూడెం: ఆర్డీవో కార్యాలయంలో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

జంగారెడ్డిగూడెం: పేదలకు ఇంటి స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి జంపన వెంకటరమణ అన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు కుంచె వసంతరావు, గొలిమే బాలయేసు, మిట్టా రామారావు, హనుమంతు, కుంచె పావని, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

వేలేరుపాడు: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎండీ మునీర్, సన్నేపల్లి సాయిబాబు, బాడిశ రాము, పిట్టా ప్రసాద్, పిట్టా వీరయ్య, మడివి కామయ్య, కురిమల వెంకటేశ్వర్లు, బంధం నాగేశ్వరావు, కంకాల గంగరాజు పాల్గొన్నారు.

సీపీఐ ధర్నా

కొయ్యలగూడెం: పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘ నాయకుల ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ నాయకులు చింతలపూడి దుర్గారావు, దుగ్గిరాల నారాయణరావు, కరటూరి దుర్గమ్మ, బల్లె అచ్చయమ్మ, యర్రావుల గాంధీ, వాగు వెంకటరత్నం, షేక్ బాజీ, వామిశెట్టి శీను, షేక్ రహీం, మోటూరి నారాయణరావు, కానూరు ఆదినారాయణ, గండు బోయిన కాశీ, రెడ్డి లక్ష్మి పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

కుక్కునూరు: ఎన్నికల్లో హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల అమలులో ఘోరంగా విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య విమర్శించారు. సోమవారం సీపీఐ మండల కార్యవర్గ సమావేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించారను. కార్యక్రమంలో వరకా శ్యామల, వర్సా పాపారావు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం



యోగా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో

కొయ్యలగూడెం: ఆధునిక కాలంలో విద్యార్థులతో సహా అన్ని వర్గాల వారు ఒత్తిడిని అధిగమించడానికి యోగ, ధ్యానం దివ్యమైన నివారిణి అని ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన యోగా పోటీలను ఆయన ప్రారంభించారు. మే 21వ తేదీ నుంచి జూన్ 21వ తేదీ వరకు నిర్వహిస్తున్న యోగా డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయిలో మే 26 నుంచి 31వ తేదీ వరకు పోటీలు నిర్వహించామన్నారు. ఇందులో గెలుపొందిన వారికి ఈ నెల 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో విద్యార్థులకు యోగాసనాలు, మెడిటేషన్ సూర్య నమస్కారాలు, ధ్యానం వంటి అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో పేర్కొన్నారు. విజేతలైన వారికి ప్రపంచ యోగా దినోత్సవ సందర్భంగా జూన్ 21న బహుమతులు అందజేస్తామన్నారు.

యోగాతో మానసిక ఉత్తేజం



కామవరపుకోట: యోగాసనాలు వేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కామవరపుకోట: ప్రతి రోజూ యోగా చేస్తే శారీరక, మానసిక ఉత్తేజం కలుగుతుందని తడికలపూడి పంచాయతీ కార్యదర్శి పి.నాగరాజు అన్నారు. యోగా మాసోత్సవాలలో భాగంగా తడికలపూడి గ్రామ సచివాలయంలో యోగాసనాలపై పీఈటీ ఉపాధ్యాయుడు ఆకుల సుధీర్ ఆధ్వర్యంలో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తడికలపూడి హోమియోపతి వైద్య అధికారి రఫి యా ప్రవీణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.వీరకుమారి, రమేష్, సీహెచ్ఓలు శివలక్ష్మి, అరుణ, పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం: కోడి పందేల స్థావరంపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. మండలంలోని మైసన్నగూడెం గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3800 నగదు, నాలుగు కోళ్లు, ఒక కోడి కత్తి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

నాటు సారా కట్టడితోనే అభివృద్ధి

చింతలపూడి: నాటు సారా తయారీ కట్టడి చేసుకోగలిగితే నాగిరెడ్డిగూడెం గ్రామాన్ని ఆదర్శవంతమైన గిరిజన గ్రామంగా అభివృద్ధి చేసుకోవచ్చని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పేర్కొన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సోమవారం నాటు సారా నిర్మూలనపై ఎక్సైజ్ శాఖ ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కేవీఎన్ ప్రభుకుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పాండురంగారావు, అజయ్ కుమార్‌సింగ్, ఏలూరు స్టేషన్ సీఐ కె.ధనరాజు, ఆర్.సత్యవతి, ఎక్సైజ్ సీఐ పి.అశోక్, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలకు ఘన నివాళి

కొయ్యలగూడెం: స్వాతంత్ర్య సమరయోధులు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జయంతిని శాఖా గ్రంథాలయంలో సోమవారం నిర్వహించారు. లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి విద్యార్థులు పాల్గొని గోపాలకృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.